ప్రజాశక్తి
బుధవారం 8 అక్టోబర్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

కౌన్సెలింగ్‌కు రంగం సిద్ధం



- 9,10 తేదీల్లో పోస్టింగ్‌లకు స్థానాల ఎంపిక
- 13 నుంచి పాఠశాలల్లో కొత్త ఉపాధ్యాయుల చేరిక

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

డిఎస్‌సి ద్వారా ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు ఈనెల 9,10 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అయితే ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ఉన్నతాధికారులు ఇంకా విడుదల చేయలేదు. డిఎస్‌సి ద్వారా ఎంపిక చేసిన 1140 మంది ఉపాధ్యాయులతో పాటు జోన్-3 కింద మోడల్ స్కూళ్ల కోసం ఎంపికైన మరో 572 మందికి ఈనెల 3వ తేదీ నుంచి గుంటూరు, నర్సరావుపేట, బాపట్ల, చీరాల, ఒంగోలు తదితర ప్రాంతాల్లో శిక్షణిస్తున్నారు. శిక్షణా కేంద్రాల్లోనే కౌన్సెలింగ్ నిర్వహించి ఉమ్మడి జిల్లా కేంద్రం డిఈవో పేరుతో పోస్టింగ్ ఉత్తర్వులు ఈనెల 10వ తేదీన జారీ చేయనున్నారు. ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిమిత్తం ఖాళీలను గుర్తించారు. ఉపాధ్యాయులకు వివిధ రిజర్వ్ కేటగిరితో పాటు మెరిట్‌కం రోస్టర్ పాయింట్‌ల ద్వారా కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నారు. ఒకే ప్రదేశంలో ఒకే పోస్టుకు ఎక్కువ మంది పోటీపడితే వారికి ఉన్న రోస్టర్ పాయింట్లు, డిఎస్‌సి మార్కుల ఆధారంగా పొందిన ర్యాంకు ప్రాతిపదికన ఆప్షన్లు ఇవ్వనున్నారు.

కౌన్సెలింగ్ వెబ్ ఆప్షన్‌ల ద్వారా ఇవ్వాలా...మ్యాన్యువల్‌గా చేయాలా అనే అంశంపై ఇంకా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాలేదని అధికార వర్గాలు తెలిపాయి. అయితే అధికారులు చెబుతున్న సమాచారం ప్రకారం ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 'ఎ' గ్రేడ్ కింద గుంటూరు కార్పొరేషన్, గ్రేడ్ బి కింద మునిసిపాలిటీలు ఉండగా మిగతా మండలాలు సి గ్రేడ్ కింద ఉంచారు. పల్నాడు జిల్లాలోని మండలాల్లో ఎక్కువ ఖాళీలు ఉన్నాయని, వీటినే ప్రథమ ప్రాధాన్యతలో ఉపాధ్యాయులను ఎంపిక చేయనున్నామని చెబుతున్నారు. అయితే ఎంపికైన ఉపాధ్యాయులు తమకు అనుకూలమైన ప్రదేశాల్లో పోస్టింగ్‌ల కోసం ప్రయత్నిస్తున్నారు. ప్రధానంగా పల్నాడు ప్రాంతంలోని రిమోట్ ఏరియాలకు వెళ్లేందుకు ఇష్టపడని వారు గుంటూరు, తెనాలి, బాపట్ల తదితర డివిజన్లలో పోస్టింగ్‌ల కోసం ప్రయత్నిస్తున్నారు. జిల్లాలో మొత్తం 1143 పోస్టులు ఖాళీగా ఉండగా ప్రస్తుతం 1140 మంది శిక్షణ పొందుతున్నారు. ఒక అభ్యర్థికి ఒక ఖాళీ ప్రాతిపదికన 1140 ఖాళీలను మాత్రమే కౌన్సెలింగ్‌లో నూతన ఉపాధ్యాయులకు అధికారులు చూపనున్నారు. జోన్-3 పరిధిలోని ఉమ్మడి ▶ 2లో



మన గ్రోమోర్ వద్ద యూరియా కోసం క్యూలో నిలబడిన రైతులు

ఒక్క బస్తా కోసం క్యూలో 15 గంటలు

యూరియా కోసం ఈపూరులో తెల్లవారుజాము నుండే అన్నంనీళ్లు లేకుండా బారులుదీరిన రైతులు

ప్రజాశక్తి-ఈపూరు

యూరియా కోసం రైతులు మండల కేంద్రమైన ఈపూరులోని మన గ్రోమోర్ వద్ద మంగళవారం తెల్లవారుజాము 6 గంటలకే వందల సంఖ్యలో బారులు తీరారు. మన గ్రోమోర్ కేంద్రంలో 440 బస్తాల యూరియా పంపిణీకి సిద్ధంగా ఉంచగా పేర్లు నమోదు చేసుకున్న రైతులకు మన గ్రోమోర్ సిబ్బంది ఒక్కొక్క బస్తాను మాత్రమే పంపిణీ చేశారు. ఈపూరుకు చెందిన రైతులు తమకే యూరియాను పంపిణీ చేయాలని చుట్టుపక్కల గ్రామాల రైతులతో వాగ్వాదానికి దిగడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి సర్ది చెప్పారు. రాత్రి ఏడు గంటల వరకు యూరియా కోసం రైతులు క్యూలో నిలబడి ఉన్నారు. బస్తా యూరియా కోసం తిండి, నీరు లేక 15 గంటలు ఎదురు చూశామని, వాపోయారు. గతంలో యూరియా కోసం ఇటువంటి ఇబ్బంది రాలేదని, పంటలకు సరైన సమయంలో పోషకాలు అందించకపోతే మొక్క ఎదుగుదల లేక నష్టపోతామని రైతులు ఆవేదనకు గురవుతున్నారు. దిగుమతి అయిన యూరియా బస్తాల్లో కొంత రైతులకు ఇచ్చినా మిగిలిన యూరియా బస్తాలను రాత్రి సమయాలలో పక్కదారి పట్టిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని ఎరువులు, పురుగుమందు దుకాణాల్లో బస్తా యూరియాను రూ.450కు అమ్ముతున్నారు.



నరసరావుపేట మండలం

ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో నిరసనలు - వైద్యాధికారులకు వినతులు

ప్రజాశక్తి-పెదనందిపాడు పల్నాడు జిల్లా

ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆశ వర్కర్స్ యూనియన్ పల్నాడు, గుంటూరు జిల్లాల గౌరవాధ్యక్షులు డి.శివకుమారి, జి.రమణ డిమాండ్ చేశారు. కనీస వేతనం, ఇతర అనేక సమస్యలపై మంగళవారం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఆశాలు నిరసనలు తెలిపి వైద్యాధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. ఇందులో భాగంగా గుంటూరు జిల్లా పెదనందిపాడు, కాకుమాను పిహెచ్‌సిలు, పల్నాడు జిల్లాలోని నరసరావుపేట మండలం కోటప్పకొండ పిహెచ్‌సి, రొంపిచర్ల, రెడ్డిపాలెం పిహెచ్‌సిల వద్ద నిరసనలు తెలిపి వైద్యాధికారులకు వినతిపత్రాలిచ్చారు. ఈ సందర్భంగా రమణ, శివకుమారి మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశా వర్కర్స్‌గా మార్పు చేయాలని, అప్పటివరకు ఆశాలతో సమానంగా అన్ని రకాల సౌకర్యాలు, వేతనం చెల్లించాలని కోరారు. చనిపోయిన ఆశ వర్కర్లకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు ఇవ్వాలని, 5జి ఫోన్లు, సిమ్‌కార్డులు, ▶ 2లో



కాకుమానులో..

ఒక్క జత కొనిస్తే బంగారు కుటుంబాలే..

- ప్రజలందరితో చేనేత వస్త్రాలు కొనుగోలు చేయించాలి
- రిజర్వేషన్ల అమలు సాధ్యం కాదంటూ మంత్రి లోకేష్ వ్యాఖ్యలు సిగ్గుచేటు
- పి4లో ఒక్క చేనేత కుటుంబాన్నీ తీసుకోలేదు
- చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి
- ముగిసిన మహాసభ - నూతన కమిటీ ఎన్నిక



మహాసభలో మాట్లాడుతున్న రమాదేవి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

చేనేత రంగాన్ని పరిరక్షించాలని పాలకులకు చిత్తశుద్ధి ఉంటే దేశంలో ప్రతి ఒక్కరితో ఒక జత చేనేత బట్టలు కొనిపించేటట్లు చేయాలని, అప్పుడు చేనేత కుటుంబాలన్నీ బంగారు కుటుంబాలవుతాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. పట్టణంలోని పోలా రామాంజనేయులు నగర్, జేఎన్ శేషయ్య ప్రాంగణం (పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం)లో రెండ్రోజులుగా జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 11వ రాష్ట్ర మహాసభల్లో భాగంగా ముగింపు రోజైన మంగళవారం రమాదేవి సౌహార్ద సందేశమిచ్చారు. చేనేత కుటుంబాల్లోని చదువుకున్న పిల్లలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేక భవన నిర్మాణ కార్మికుల గాను, ఇతర వృత్తుల్లో పనిచేస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారికి కనీసం నిరుద్యోగ భృతైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పి4 పథకం ద్వారా పేదరికంలో ఉన్న ఏ ఒక్క చేనేత కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించి మార్గదర్శకులకు అప్పగించినట్లు కనిపించలేదన్నారు. చేనేత వృత్తిలో పనిచేస్తున్న మహిళలకు ▶ 2లో

సిజెఐపై దాడి యత్నంపై నిరసన

ప్రజాశక్తి-సత్తెనపల్లి : భారత లౌకిక రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి.. సనాతన ధర్మం పేరుతో మనుధర్మ శాస్త్రాన్ని ముందుకు తెచ్చే కుట్రలో భాగమే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్‌పై మతోన్మాదుల దాడి యత్నమని సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య విమర్శించారు. మంగళవారం స్థానిక తాలూకా సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ అధ్యక్షతన నిరసన సభ నిర్వహించారు. చలమయ్య మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా స్వతంత్ర సంస్థలైన వాటిని కేంద్రంలోని మతోన్మాద బిజెపి ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని, కొన్ని సందర్భాల్లో వీటిని సుప్రీంకోర్టు అడ్డుకుంటోందని అన్నారు. దీన్ని సహించిలేని ఆర్‌ఎస్‌ఎస్, మతోన్మాదులు దాడులకు తెగబడుతున్నారని చెప్పారు. ప్రస్తుతం సిజెఐపై దాడికి యత్నించిన రాకేష్ కిషోర్ ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తని, సనాతన ధర్మ



వాదని అన్నారు. దాడిని ప్రజాతంత్ర వాదులందరూ ఖండించాలని కోరారు. కార్యక్రమంలో చేతివృత్తిదారుల సంగం రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల, నాయకులు జి.ఉమశ్రీ, ఎం.హరిపోతురాజు, జె.రాజ్‌కుమార్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.రాజు, పి.బాలకృష్ణ, నాయకులు కె.శివదుర్గారావు, ఎ.వీరబ్రహ్మం, వృత్తిదారుల సంఘం నాయకులు వెంకటరావు, ఎన్.చంద్రకళ పాల్గొన్నారు.

పీజీ సోషల్ వర్క్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ కోర్సు రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాదరావు మంగళవారం విడుదల చేశారు. 13 మందికిగాను 11 మంది ఉత్తీర్ణత సాధించారు. రీవాల్యూయేషన్కు ఒక్కో పేపరుకు రూ.1860ను ఈనెల 17లోగా చెల్లించాలని సూచించారు.

బి.టెక్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

వర్సిటీ పరిధిలో బి.టెక్ 3/4 మొదటి సెమిస్టర్ సప్లమెంటరీ పరీక్షల ఫలితాలను సిఇ శివప్రసాదరావు విడుదల చేశారు. 132 మందికి 87మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. రీవాల్యూయేషన్కు ఒక్కో పేపరుకు రూ.2070లను ఈనెల 17లోగా చెల్లించాలని సూచించారు.

ఏపి పీజీసెట్ పిడబ్ల్యూడి కేటగిరిలకు 9న కౌన్సెలింగ్

ఏపి పీజీ సెట్ ప్రవేశాల్లో భాగంగా పర్సన్ విత్ డిజేబిలిటీస్ (పిడబ్ల్యూడి) కేటగిరిలో అడ్మిషన్లకు ఈనెల 9న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కౌన్సెలింగ్ కో-ఆర్డినేటర్ ఆచార్య ఆర్విఎస్ఎస్ఎన్. రవికుమార్ తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. ఉదయం 10 గంటలకు వర్సిటీలోని హెల్ప్ లైన్ సెంటర్లో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

కౌన్సెలింగ్‌కు రంగం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాలు గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలోని మోడల్ స్కూళ్లకు 572 మందిని కూడా కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేయనున్నారు. మోడల్ స్కూళ్లలో కూడా పిజిటి, టిజిటి ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్నారు. ప్రతి మోడల్ స్కూలులో ఒక హెచ్ఎం. కనీసం నలుగురు ఉపాధ్యాయులు ఉండేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఈ దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఒక్క మోడల్ స్కూలులో కనీసం 60 మంది విద్యార్థులు ఉండాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

నాణ్యమైన యూనిఫాం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిహెచ్‌సికి వెళ్లిన సందర్భంలో టిఎ, డిఎలు ఇవ్వాలన్నారు. ఎఎన్ఎం, జిఎన్ఎం శిక్షణ పొందిన ఆశాలకు పర్మినెంట్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సిఐటియు పెదనందిపాడు మండల నాయకులు డి.రమేష్‌బాబు, నరరావుపేట మండల కార్యదర్శి సిలార్ మసూద్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే జీతాలు పెంచుతామని హామీనిచ్చిన కూటమి ఇప్పుడు విస్మరించిందన్నారు. ఆశాలు అనారోగ్య కారణాలతో చనిపోతే రూ.10 లక్షల బీమా అమలు చేయాలని, కుటుంబంలోనే ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఆశాల నియామకాల్లో రాజకీయ జోక్యం లేకుండా చూడాలన్నారు. వర్కర్లపై పని భారం పెరగడంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, రాత్రిళ్లు కూడా విధులు నిర్వహించాలని చెప్పడం దుర్మార్గమని విమర్శించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశాలను నియమించాలని, నియామకంలో రాజకీయ జ్యోక్యం లేకుండా చూడాలని కోరారు. రికార్డులు, అదనపు పనులు చేయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో ఎం.సరిత, పి.సరళాదేవి, మేరిమణి, టి.రత్నకుమారి, రాణి, త్రివేణి, జ్యోతి, మరియమ్మ, విజయ, సౌజన్య, కె.శ్రీనివాసరావు, గోవిందమ్మ, నాగలక్ష్మి, కృష్ణ లీలావతి, ధనలక్ష్మి, సిహెచ్ మాలతి, అంజమ్మ, రమాదేవి, కోటేశ్వరమ్మ, మహేశ్వరి, ఖాసింభీ ఆశాలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని వేములూరుపాడు సమీపంలో మంగళవారం జరిగింది. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం నుంచి ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న శివనాగ ప్రసాద్ ఎదురుగా వస్తున్న మరొక ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. శివ నాగ ప్రసాద్‌కు తలకు బలమైన గాయాలవడంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కొద్ది సేపటికి మృతిచెందాడు. సిఐ కె.శివరామకృష్ణ కేసు నమోదు చేశారు.

పిహెచ్‌సి వైద్యుల సమస్యలను పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



డాక్టర్ల సమస్యను పరిష్కరించేలాగా ముఖ్యమంత్రి చొరవ చూపి అధికారులకు తగు విధంగా ఆదేశాలు జారీ చేయాలని, డాక్టర్ల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, అధికారులతో జరిగిన చర్చలు విఫలం కావడంతో అక్టోబర్ 5 నుండి రిలే నిరాహార దీక్షలు విజయవాడలో నిర్వహిస్తున్నారు. సమ్మెను కొనసాగిస్తున్నామని వైద్యులు ప్రకటించారు. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న డాక్టర్స్ జీఓ 99 ద్వారా కోత విధించిన ఇన్ సర్వీస్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోటా పునరుద్ధరించాలని, సమయ నిర్ధారిత ప్రమోషన్స్, ట్రైబల్ అలవెన్సు, 104 సంచార చికిత్స అలవెన్సు, నోషనల్ ఇంక్రిమెంట్ వంటి తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్ల అసోసియేషన్ చేపట్టిన సమ్మెకు మద్దతుగా పెద్ద గొట్టిపాడు పీహెచ్సీ వద్ద నిరసన తెలిపారు. వాటితో పాటుగా ఆశా వర్కర్స్‌కు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన తెలిపారు. జ్యోతి, పద్మ, విమల, సురేఖ, యేసు మరియమ్మ, ప్రేమ కుమారి పాల్గొన్నారు.



సాంకేతిక విద్యలో ప్రాంతీయ భాషలకు ప్రోత్సాహం

సెమినార్ పోస్టర్ ఆవిష్కరణలో వైవి ఆంజనేయులు

ప్రజాశక్తి - తాడికొండ

సాంకేతిక విద్యలో భారతీయ భాషలను ప్రోత్సహించడానికి ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వాని పథకంలో ప్రారంభించినట్లు చలపతి ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ వైవి ఆంజనేయులు తెలిపారు. మంగళవారం మోతడక చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఫ్యూచర్ స్మార్ట్ సిటీ ఇంటెలిజెంట్ మొబిలిటీ అనే అంశంపై జరిగే సెమినార్ పోస్టర్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 17, 18 తేదీలలో ఈ సెమినార్ ఉంటుందని, సాంకేతిక విద్యలో భారతీయ భాషల వినియోగాన్ని ప్రోత్సహించడం ప్రాంతీయ భాషలలో జ్ఞానాన్ని వ్యాప్తి చేయడంపై చర్చ ఉంటుందని చెప్పారు. సెమినార్‌లో విద్యార్థులు, అధ్యాపకులు మాతృభాష సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకోవడానికి అర్థం చేసుకోవడానికి ప్రోత్సహిస్తామని తెలిపారు. ప్రాంతీయ భాషల్లో విజ్ఞానానికి సంబంధించిన పరిశోధన ప్రచురణాలు ప్రోత్సహించడం ప్రజాదరణ పొందిన ప్రాంతీయ భాషలలో పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య పరిశోధన సంబంధాలను ఏర్పరుస్తామని చెప్పారు. విద్యార్థులు వారి వారి మాతృభాషలోనే సాంకేతిక విద్యను పొందడానికి సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో చలపతి విద్యా సంస్థల కార్యదర్శి వై.సుజిత్ కుమార్ ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా నాగ శ్రీనివాసరావు, డీన్ ఆఫ్ ఎగ్జామ్స్ డాక్టర్ వివి సుబ్బారావు, డీన్ అఫ్ ఆర్ అండ్ డి డాక్టర్ పి.బాలమురళీకృష్ణ, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ నాగమల్లేశ్వరరావు, జి.రామచంద్రరావు, సాయి శ్రీనివాస్, కళ్యాణ్‌కుమార్, రత్నబాబు, తులసిరాణి, శాంతిప్రియ, శంకర్రావు, రవికిరణ్, హనుమంత్ నాయక్, గాంధీ పాల్గొన్నారు.



వంగిపురం గ్రామంలో రైతులకు మందు పంపిణీ చేస్తున్న మండల వ్యవసాయ అధికారి సుగుణ బేగం

ఎలుకల నివారణకు మందు పంపిణీ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు : సామూహిక ఎలుకల నివారణ కోసం మందును మండలంలోని యనమదల, వంగిపురం గ్రామాల్లో వ్యవసాయ అధికారి సుగుణ బేగం, వట్టిచెరుకూరు మండలం వ్యవసాయ అధికారి సునీత, గుంటూరు రూరల్ మండలం జొన్నల గడ్డ, బుడంపాడు గ్రామాలలో వ్యవసాయ అధికారి బి.కిషోర్ మంగళవారం పంపిణీ చేశారు. రైతులందరికీ సామూహికంగా బ్రొమోడైలీన్ నూకలతో కలిపి (96:2:2) 96 శాతం నిష్పత్తితో నూక, 2 శాతం నిష్పత్తితో నూనె, 2 శాతం నిష్పత్తితో బ్రోమోడైయులను కలిపి 10 గ్రాముల పొట్లాలు కట్టి రైతులకు ఇచ్చామన్నారు. వరి పొలాల్లో బొరియల్ని గుర్తించి వాటిని మూసివేయాలని, తర్వాత రోజు బొరియల్లో మందు పొట్లాలను ఉంచాలని సూచించారు. చేతులకు మందు తగలకుండా గ్లౌజులు వేసుకోవాలన్నారు. రెండున్నర ఎకరాలకు 50 గ్రాములు చొప్పున 10 గ్రాములు పొట్లాలు పెట్టుకోవాలన్నారు.

కెఎల్‌యును సందర్శించిన జర్మని ప్రతినిధుల బృందం

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్



కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీని జర్మనీకి చెందిన చెన్నైలోని జర్మన్ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్, హైదరాబాద్‌లోని జర్మనీ కాన్సుల్ అమిత దేశాయ్ లు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు కెఎల్ విశ్వ విద్యాలయంలోని వివిధ రకాల ఆచార్యులను, పరిశోధకులను కలిసి విద్యా, పరిశోధన సహకారాల అవకాశాలను గురించి విస్తత స్థాయిలో చర్చలు జరిపారు. అనంతరం వారు వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, ప్రో వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, అంతర్జాతీయ సంబంధాల డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు, అంతర్జాతీయ సంబంధాల డైరెక్టర్ విజయ్ మారుతి, విదేశీ భాషల విభాగాధిపతి జమీందార్‌లను కలిశారు. చర్చల తర్వాత కాన్సుల్ జనరల్ క్యాంపస్‌లో సౌకర్యాలను చూసి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయంలోని వందలాది మంది విద్యార్థులకు జర్మన్ భాషలో శిక్షణ ఇస్తున్నట్లు చూసి ఆశ్చర్యపోయారు. ఈ బందం జర్మన్ భాషలో చదువుతున్న విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించింది.

మంగళగిరిలో రాజస్థాన్ రాష్ట్ర ప్రణాళిక ఉన్నతాధికారులు సందర్శన

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్వర్ణ ఆంధ్రా విజన్-2047 యూనిట్ కార్యాలయాన్ని రాజస్థాన్ రాష్ట్ర ప్రణాళికా విభాగం ఉన్నత అధికారులు మంగళవారం సందర్శించారు. పేదరిక నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన సమగ్ర సమాచారం, అమలు చేసే విధానంపై పరిశీలించారు. పి4 సంబంధించిన విధానంపై రూపొందించిన యాప్ ద్వారా వివరించారు. నియోజకవర్గం, జిల్లా విజన్ యాక్షన్ ప్లాంట్ యూనిట్ సభ్యు లను అడిగి తెలుసుకున్నారు. డైరెక్టర్లు చేతన్ ప్రకాశ్ మండవల్, నిర్మల్ సేథీ, వినేష్ సింగ్వీ, డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ అధికారి లతీఫ్, ప్లానింగ్ నుండి ఉప గణాంక అధికారి బాబురావు పాల్గొన్నారు.

ఒక్క జత కొనిస్తే బంగారు కుటుంబాలే..

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే రూ.వంద ఆదాయంతో ఎలా బతకగలరని ప్రశ్నించారు. ఇటీవల చేనేత కార్మికులంతా మంత్రి లోకేష్‌ను కలసి 11 రకాల రిజర్వేషన్లు అమలుపై కోరగా దీని అమలు ఎవరివల్లా కాదంటూ మంత్రి మాట్లాడ్డం సిగ్గుచేటని విమర్శించారు. చేనేత వస్త్రాలు ఆరోగ్యవంతమైనవని, మానవ శ్రమతో తయారయ్యేవి కాబట్టి ఎక్కువ ధర ఉంటాయని చెప్పారు. పెట్టుబడిదారుల పరిశ్రమలో తయారైన బట్టను మార్కెట్లో చేనేత వస్త్రంగా అమ్ముతూ రూ.వేలకోట్లు కొల్లగొడుతున్నారని, దీంతో చేనేత రంగం ధ్వంసమవుతోందని ఆవేదన వెలిబుచ్చారు. అటువంటి వారిపై ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడానికి సిద్ధపడటం లేదన్నారు. పత్తి మీద, నూలుపై, రంగులపై, రసాయనాలపై, తయారైన బట్టపై ఉన్న జీఎస్టీని పూర్తిగా రద్దు చేస్తే చేనేత రంగం బతుకుతుందన్నారు. జీఎస్టీ తగ్గించామంటూ ప్రచారం చేసుకోవటానికి కర్నూలు జిల్లాకు ప్రధాని రాబోతున్నారని, ఆ సందర్భంగా చేనేతపై జీఎస్టీని రద్దు చేయాలని చేనేత కార్మికులంతా కోరాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దె చలమయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట కాలంలో చేనేత కార్మికులు ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు చేశారని, ఆ స్ఫూర్తితో చేనేత కార్మికులు నేటికీ పనిచేయడం వల్లే చేనేత రంగం ఈమాత్రమైనా బతికుందని చెప్పారు. చేనేత కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గంజి మురళి మాట్లాడుతూ చేనేత కార్మికుల పట్ల రెండు రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని, తెలంగాణ రాష్ట్రంలో చేనేత రంగ పరిరక్షణ కోసం కార్మికులు పెద్ద ఎత్తున పోరాడటంతో ప్రభుత్వం త్రిఫ్ట్ ఫండ్‌ను మంజూరు చేసిందని తెలిపారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికై పోరాటాలే మార్గమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి కూరపాటి రమేష్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న కాలంలో చేనేత కార్మికుల సమస్యలపై చేనేతను పరిరక్షించేందుకు ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం పెద్ద ఎత్తున పోరాటాలు చేసి అనేక విజయాలు సాధించిందని గుర్తు చేశారు. వాజ్‌పాయ్ ప్రధానిగా ఉన్న కాలంలో సత్యం కమిటీ చేసిన సిఫార్సులకు వ్యతిరేకంగా చేనేత కార్మికులందరినీ పెద్ద ఎత్తున సమీకరించి ఢిల్లీలో పోరాడి తిప్పికొట్టామని చెప్పారు. అదే స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు తీర్మానాలను మహాసభ ఆమోదించింది. రాష్ట్ర నూతన కమిటీని, అధ్యక్ష కార్యదర్శులుగా కె.రాజు, పి.బాలకృష్ణను ఎన్నుకున్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

ప్రజాశక్తి - చేబ్రోలు

జిల్లా స్థాయిలో పంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళ వారం చేబ్రోలులో నిర్వహించినట్లు మండల పరిషత్ అభివద్ధి అధికారి టి ఊహారాణి తెలిపారు. ముఖ్య అతిథులుగా జిల్లా పంచాయతీ అధికారి వివిఎన్ సాయికుమార్ పాల్గొని శిక్షణ ఉద్దేశించి మాట్లాడారు. శ16 మండలాలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శులకు మాస్టర్ ట్రైనర్స్‌గా శిక్షణ పొందారు. శిక్షణ వనరుల వ్యక్తులుగా జిల్లా పంచాయతీ వనరుల కేంద్ర రిసోర్స్ పర్సన్ కె అనురాధ ,జిల్లా శిక్షణ మేనేజర్ కె నాగేశ్వరరావు వ్యవహరించారు. కార్యక్రమంలో ఈటిసి బాపట్ల ఫ్యాకల్టీ కెలలిత, డిప్యూటీ ఎంపీడీవో ఎం రవిశంకర్ , ఎంసిఓ ఎస్‌బిఎంజి ప్రసాద్ , ఎంపిక చేయబడిన శిక్షకులు(ట్రైనర్స్)గా మండలానికి ఒక పంచాయతీ కార్యదర్శి చొప్పున పాల్గొన్నారు.

జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - చేబ్రోలు

జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నారాకోడూరులో గూడ్స్ సర్వీస్ టాక్సెస్ అంశంపై అవగాహన సదస్సు ప్రధానోపాధ్యాయులు ఎం ఏడుకొండలు అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఎంఇఓ రాయల సుబ్బారావు హాజరై విద్యార్థులకు సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ విషయా లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి రాజ్యలక్ష్మి బి కోటి పద్మ పిచ్చమ్మ ఎం వెంకటేశ్వరావు విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో పోషణా మాసం

ప్రజాశక్తి - పెదనందిపాడు

మంగళవారం పెదనందిపాడులోని బీసీ-3 కాలనీ అంగన్వాడి సెంటర్‌లో 8 వ రాష్ట్రీయ పోషణా మాసం కార్యక్రమం నిర్వహించారు. తల్లి బిడ్డల 1,000 రోజుల సంరక్షణ గురించి ప్రతి తల్లి మొక్కలు నాటడం వలన బిడ్డలు ఆరోగ్యవంతమైన వాతావరణంలో పెరుగుతారని, స్థానికంగా దొరికే ఆకుకూరలు, మునగాకు తో మిల్లెట్స్ తయారుచేసే విధానం తల్లులకు చూపించారు. పోషక విలువలు ఉన్న ఆహార పదార్థాల ప్రదర్శన, పెరటి తోటల పెంపకం గురించి, బాలామృతం పంపిణీ గురించి వివరించారు. న్యూట్రిషన్ ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎండి జరీనా, అంగన్వాడీ టీచర్స్ అమరేశ్వరి, కోటేశ్వరమ్మ, కమల, రాజేశ్వరి పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి జైలు

ప్రజాశక్తి - తెనాలి

గంజాయి కేసులో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. రూరల్ ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ముత్తెంశెట్టిపాలెంకు చెందిన గుంటినపల్లి పూర్ణచందు, సీబీఎన్ కాలనీకి చెందిన మొగిలి సాయి, గండికోట గోపి బైక్‌పై వస్తూ 2021 అక్టోబర్ 16న పోలీసులు వాహన తనిఖీ చేస్తుండగా పెదరా వూరు జంక్షన్ వద్ద 500 గ్రాముల గంజాయితో పట్టుబడ్డారు. వీరిలో గోపి పరారవగా, మిగిలిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. కొద్ది రోజులకు గోపిని అప్పటి సీఐ ఎం.సుబ్రహ్మణ్యం, ఎస్ఐ జి. ఏడుకొండలు అరెస్టు చేశారు. ఈ కేసు మంగళవారం విచారణకు రాగా సాక్ష్యాధారాలను పరిశీలించిన ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఎ. పవన్‌కుమార్ పూర్ణచందు, మొగిలి సాయి లకు మూడు నెలల జైలుశిక్ష, రూ. 1000 చొప్పున జరిమానా విధించారు. మూడో నిందితుడు గోపిపై నేరం రుజువు కాకపోవడంతో కేసు కొట్టివేశారు. ప్రాసిక్యూషన్ తరపున సీనియర్ ఎపిపి పరిశపోగు సునీల్‌కుమార్ వాదించగా, ప్రస్తుత ఎస్ఐ ఆనంద్, కోర్టు కానిస్టేబుల్ వి. శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



నిందితులు పూర్ణచందు, సాయి

ఎలుకల నివారణకు చర్యలు : ఎడిఎ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ప్రతి గ్రామాల్లో రైతులు సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టాలని మండల సహాయ వ్యవసాయ సంచాల కులు ఆర్ విజయబాబు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అన్ని రైతు సేవ కేంద్రాల్లో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించి సామూహిక ఎలుకల నియంత్రణ కార్యక్రమాన్ని చేపట్టారు. విజయబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారాబ్రోమోడయోలిన్ ముందును 100శాతం రాయితీపై సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఎలుకలు కారణంగా ప్లేగు వ్యాధి సంక్రమించే ప్రమాదముందని తెలియజేశారు. తెనాలి మండల వ్యవసాయ అధికారి కే సుధీర్ బాబు మాట్లాడుతూ హెక్టారు వరి పంటకు 100 గ్రాముల విషపు ఎర తయారు చేయడానికి 96 గ్రాముల నూకలు, 2 గ్రాముల నూనె, 2 గ్రాముల బ్రోమోడయోలిన్ రసాయనాన్ని కలిపి మిశ్రమంగా తయారు చేయా లన్నారు. ఒక సజీవ బొరియకు 10 గ్రాములు చొప్పున విషపు ఎరను పొట్లాలుగా కట్టి బొరియల్లో వేయాలన్నారు. 500 గ్రాముల విషపు ఎర హెక్టరుకి సరిపోతుందన్నారు. తెరుచుకున్న బొరియలను గుర్తించి వాటిలో 10 గ్రాములు చొప్పున విషపు ఎరను పొట్లాలుగా కట్టి బొరియాల్లో వేయాలన్నారు. డిఆర్సి జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి రాజవంశీ, ఆర్ఎస్కె సిబ్బంది ఎం నాగరాజు, లావణ్య, హెూగ్లా, శుభోదయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని అన్ని గ్రామాలలో మంగళవారం రైతు సేవా కేంద్రాల వద్ద పంట పొలాల్లో ఎలుకల నియంత్రణ కోసం రైతులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి గుంటూరు డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎన్ మోహనరావు రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎలుకలను నివారించడానికి ఉపయోగపడే మందులు రైతులకు అందజేశారు. మండల వ్యవసాయ శాఖ అధికారి రమణ కుమార్,వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు జయ రామిరెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని వేములూరిపాడు గ్రామ సమీపంలో గోకుల్ వద్ద గుంటూరు కర్నూలు రహదారిపై మంగళవారం జరిగింది. మండలంలోని పొనుగుపాడు గ్రామానికి చెందిన కంబాల రత్నసాగర్ (36) గ్రామంలో దేవాలయ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరయ్యేందుకు కుటుంబంతో ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. నరసరావుపేట వైపు నుంచి గుంటూరుకు వస్తున్న ఇన్నోవా కారు ఫిరంగిపురం- వేములూరి గ్రామాల మధ్యన రత్నసాగర్ బైకును బలంగా ఢీ కొట్టింది. దీంతో బైక్ కుడివైపు రోడ్డు మీదకు రావడంతో మరో ద్విచక్ర వాహనంపై గుంటూరు వైపు నుంచి వస్తున్న గుర్తుతెలియని వ్యక్తి కారును ఢీ కొట్టింది.





ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన వారిని స్థానికులు ప్రైవేట్ వాహనంలో వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మార్గం మధ్యలోగుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. రత్నసాగర్ చికిత్స పొందుతుండగా కొద్దిసేపటికి మరణించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

తల్లులు పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సూపర్ వైజర్ మాధవి అన్నారు. మిల్లెట్లు, పప్పులు, కూరగాయలు, పండ్లు, రోజు ఆహారంలో ఉండేలా చూసు కోవాలనీ, ప్రతి ఇంటిలో పెరటి తోటలు ఏర్పాటు చేసు కొని ఆకుకూరలు, కూరగాయలు, క్రిమి సంహారక మందులు వాడకుండా పండించిన వాటిని ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. పిల్లలకు అల్పాహారం కూడా పప్పు ధాన్యాలు లేదా రాగి, జొన్న, వేరుశెనగలు,నువ్వులు,బెల్లంతో చేసిన సాంప్రదాయ వంటకాలు మాత్రమే తినిపిస్తే వయసుకు తగిన ఎత్తు బరువుతో ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమం తిక్కిరెడ్డి పాలెం అంగన్వాడీ కార్యకర్త శ్రీదేవి బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

వాననీటి ఉధృతి.. రాకపోకలకు ఇబ్బంది..



లింగాపురం చంద్రవంక బ్రిడ్జి వద్ద పర్యవేక్షిస్తున్న ఆర్‌ఐ, సిబ్బంది

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

కొద్దిపాటి వర్షానికే చంద్రవంక వాగు పొంగిపొర్లుతోంది. ఈ ఏడాది అధికంగా వర్షాలు పడటంతో మాచర్ల చుట్టుపక్కల గ్రామాల వాగులు, వంకలు ఉధృతంగా పారుతూ, చెరువులు నిండాయి. దాంతో చిన్న వర్షం పడినా చంద్రవంక ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. ఆదివారం, సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మాచర్ల పట్టణం నుండి మండల పరిధిలోని లింగాపురం, జమ్మలమడక గ్రామాలకు వెళ్లే బ్రిడ్జిలపై నుండి చంద్రవంక ప్రవహిస్తోంది. వినాయకగుట్టకు, అజాద్ నగర్ వెళ్లే బ్రిడ్జిలపై నుండి కూడా వాగు ప్రమాదకరంగానే ప్రవహిస్తోంది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తహశీల్దార్ కిరణ్ కుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ అనిల్ కుమార్ స్థానిక బొంబాయి కంపెనీ, ఆజాద్ నగర్, ప్రాంతాలలో చంద్రవంక వాగు ప్రవహిస్తున్న ప్రాంతాన్ని ప్రజలు దాటకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఏదైనా సంఘటనలు జరిగితే తక్షణమే మాచర్ల తహశీల్దార్‌కు సమాచారం ఇవ్వాలని గ్రామ రెవెన్యూ అధికారులకు, గ్రామ రెవెన్యూ సహాయకులను ఆదేశించారు.

పాటిబండ్లకు రాకపోకలు బంద్

ప్రజాశక్తి - పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడు నుండి పాటిబండ్లకు రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఆ రెండు గ్రామాల వద్ద ఉన్న బ్రిడ్జి వరదకు కొట్టుకుపోయింది. గత నెలలో కురిసిన భారీ వర్షానికి కొంత భాగం కొట్టుకుపోగా తాత్కాలిక మరమ్మతులు చేసినా ప్రస్తుతం ప్రయోజనం లేకుండా పోయింది. రైతులు పొలాలు వెళ్లటానికి నానా అవస్థలు పడుతున్నారు. సత్వరం బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.





చీఫ్ జస్టిస్‌పై దాడి యత్నానికి ఖండనగా న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై దాడి యత్నాన్ని ఖండిస్తూ న్యాయవాదులు సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగూరి అజయ్ కుమార్ ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని నాలుగు న్యాయస్థానాల్లో మంగళవారం విధులను బహిష్కరించారు. తాలుకా న్యాయస్థానం గేటు ముందు నిరసన తెలిపారు. దాడికి యత్నించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని, ఇది మొత్తం న్యాయ వ్యవస్థపై జరిగిన దాడి అని గంగూరి అజయ్ కుమార్ అన్నారు. నిరసనలో సి.హెచ్.మణిబాబు, ఆర్.గోపాలకృష్ణమూర్తి, సయ్యద్ అబ్దుల్ రహీమ్, డి.శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వరరావు, కె.నాగవెంకట హరిబాబు, బి.సంగీతరావు, జె.విజయ్ కుమార్, ఇ.ఏడుకొండలు, ఆర్.నరసింహారావు, ఎన్.వేణుగోపాల్, జి.పవన్, సి.హెచ్.బాలకోటయ్య, జె.శేషయ్య, పి.రవికుమార్, ఇ.మురళీ పాల్గొన్నారు.

భారీ వానలతో ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

ప్రజాశక్తి - మాచర్ల

ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలకు మాచర్ల విద్యుత్ శాఖ సబ్ డివిజన్ పరిధిలో పలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. మాచర్ల పట్టణంలోని రెండు క్యూబిక్, రెండు సాధారణ ట్రాన్స్‌ఫార్మర్లు, రూరల్ పరిధిలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, వెల్దుర్తిలో ఒకటి, దుర్గిలో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమైనట్లు విద్యుత్ శాఖ ఏడీఈ రామయ్య తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా అవసరమైన చోట వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లను మార్చినట్లు చెప్పారు. మొత్తంగా నష్టం రూ.2.50 లక్షలని పేర్కొన్నారు.

నల్లబర్లీ పొగాకును సాగు చేయొద్దు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

నల్లబర్లీ పొగాకుపై నిషేధం ఉందని, ఎవ్వరూ సాగుచేయొద్దని మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఈ అంశంపై మండలంలోని చాగంటివారిపాలెంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ 2025-26 రబీ నుండి రాష్ట్రంలో నల్లబర్లీ పొగాకు సాగును నూరుశాతం నిషేధించినట్లు చెప్పారు. దీన్ని సాగు చేయకుండా పర్యవేక్షణకు జిల్లా, డివిజనల్, మండల స్థాయిలలో టాస్క్‌ఫోర్స్ కమిటీలనూ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నల్లబర్లీ పొగాకు నారు సాగు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తెల్లబర్లీ పొగాకును సాగుచేయాలన్నా ఆయా సంస్థల నుండి అగ్రిమెంట్ బాండ్లను తప్పనిసరిగా పొందాలని స్పష్టం చేశారు. ఆ బాండ్ల జిరాక్స్ కాపీలను మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. రబీలో ప్రత్యామ్నాయ పంటలుగా మొక్కజొన్న, పెసర, మినుము లేదా చిరుధాన్యాలు (కొర్ర, సజ్జలు, జొన్నలు) సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ నగేష్, వ్యవసాయ విస్తరణాధికారి శేషుబాబు, విలేజ్ అగ్రి అసిస్టెంట్ పావని, పోలీసు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.





కనీస వేతనం కోసం ఆశాల నిరసన

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు ఇవ్వాలని యూనియన్ పల్నాడు జిల్లా కార్యదర్శి జి.మల్లేశ్వరి కోరారు. డిమాండ్ చేశారు. మండలంలోని తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిరసన తెలిపి అధికారులకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ ఆశాలకు ఆరేళ్లుగా జీతాలు పెరగలేదని, మరోవైపు అన్ని నిత్యావసరాల ధరలు మాత్రం భారీగా పెరిగాయని చెప్పారు. కనీస వేతనం అమలు చేయాలన్నారు. అన్ని రకాల సెలవులు, మెడికల్ లీవులు మంజూరు చేయాలని, ఆశా వర్కర్లు చనిపోతే మట్టి ఖర్చులు రూ.20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పుడున్న ఫోన్లు సరిగా పనిచేయడం లేదని, ఈ నేపథ్యంలో 5జి మొబైల్‌తోపాటు సిమ్‌కార్డు ఇవ్వాలని, నాణ్యమైన యూనిఫామ్ అందించాలని కోరారు. ఆశాలు పిహెచ్‌సికి వెళ్లిన సందర్భంలో డీఏ, టిఎలు ఇవ్వాలన్నారు. అర్హత ఉన్నవారికి ఎఎన్ఎంలుగా ప్రమోషన్ కల్పించాలని, ఆశాలకు పనిభారం పెరిగిన నేపథ్యంలో జనాభా ప్రాతిపదికన ఆశాల నియామకం చేపట్టాలని, ఆశాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మేరీ, సుమతి, రాణి, పద్మ, రహమత్ పాల్గొన్నారు.



నాగార్జునసాగర్ ప్రాజెక్టు 22 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

మళ్లీ తెరుచుకున్న సాగర్ గేట్లు

ప్రజాశక్తి - విజయపురిసౌత్


నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరదనీటి చేరిక పెరగటంతో గేట్లు మళ్లీ తెరుచుకున్నాయి. మంగళవారం 22 గేట్లను 5 అడుగుల వరకు ఎత్తి 1,77,518 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 2,29,950 క్యూసెక్కులు వచ్చి చేరటంతో ఇక్కడ నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 2,29,950 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కుడి కాల్వకు 10,040 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 8,022, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 33,170, ఎస్ఎల్బీసీకి 1,200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటిమట్టం 589.70 అడుగుల వద్ద ఉంది. ఇది 311.1486 టీఎంసీలకు సమానం.

మాటలతో బెదిరించి.. మీటర్లు బిగించి..

- స్మార్ట్ మీటర్లు బిగిస్తున్న అదాని కంపెనీ సిబ్బంది
- సహకరిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది
- అమలవ్వని మంత్రి ప్రకటన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

తాము అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్లను ఎత్తేస్తామని చెప్పిన కూటమి ఆ మాటను విస్మరించి గత వైసిపి ప్రభుత్వ బాటలోనే నడుస్తోంది. వినియోగదారుల అంగీకారం లేకుంటే బిగించొద్దని విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్ ప్రకటన సైతం క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఎక్కడిక్కడ అదానీ కంపెనీ సిబ్బంది స్మార్ట్‌మీటర్లతో జనం ఇళ్లపై పడుతున్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది సహాయం తీసుకుని ప్రజలకు మభ్యపెట్టి తమ పని కానిచ్చేస్తున్నారు. పట్టణంలోని 27, 28 వార్డుల్లో ఇది వేగంగా జరుగుతోంది. ఎవరైనా ప్రశ్నిస్తే ఇప్పుడు బిగించుకోకుంటే మీటర్ ఉచితమని, తర్వాత అయితే డబ్బులు చెల్లించాల్సి ఉటుందని, అందరూ పెట్టించుకుంటున్నారని తదితర మాటలను చెప్పి వినియోగదార్లను భయపెడుతున్నారు. అదాని కంపెని సిబ్బంది గ్రూపులుగా ఏర్పడి పలు ప్రాంతాల్లోకి వెళ్లి మీటర్ల బిగింపును వేగవంతం చేశారు.



చిలకలూరిపేట పట్టణంలో మొత్తం విద్యుత్ మీటర్లు 60 వేలు, రూరల్ పరిధిలో 22 వేలు, యడ్లపాడు మండలం 18 వేలు, నాదెండ్ల మండలంలో 22 వేల వరకూ ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. చిలకలూరిపేట పట్టణంలో 40 వేల వరకు మీటర్లు పేదల నివాస ప్రాంతాల్లోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సర్‌ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీలు, అంటూ వివిధ రూపాల్లో విద్యుత్ భారాలను వీరు మోస్తున్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో తమపై మరో పిడుగు పడుతుందని సామాన్య వినియోగదార్లంతా ఆందోళనకు గురవుతున్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



పెదకాకాని ధర్నాలో మాట్లాడుతున్న వై నేతాజీ

ప్రజాశక్తి - పెదకాకాని

ప్రజల ఆరోగ్యం కాపాడటం కోసం తమ ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి ఇంటి ఇంటికి తిరిగే ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లు తీర్చాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వై నేతాజీ డిమాండ్‌చేశారు. మంగళవారం ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో పెదకాకానిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ధర్నాలో వై.నేతాజీ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని, చట్టప్రకారం అన్ని రకాల సెలవులు ఇవ్వాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా వర్కర్లుగా మార్పు చేయాలని అప్పటివరకు ఆశా వర్కర్లతో సమానంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు సరిగ్గా పనిచేయట్లేదని, వాటి స్థానంలో 5జి ఫోన్లు ఇవ్వాలని, చనిపోయిన ఆశ వర్కర్లకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు గత ఆరేళ్లుగా జీతాలు పెంచలేదని, నిత్యావసర సరుకుల ధరలు, ఖర్చులు మాత్రం అనేక రెట్లు పెరిగాయన్నారు. ధర్నా అనంతరం పెదకాకాని, వెనిగండ్ల మెడికల్ ఆఫీసర్లకు మెమోరాండం ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కె.కుమారి, టి.రాధిక, టి.సీతారామ, కుసుమ, ఎం.ఇందిరా, షేక్. మరింబి, ఎస్.జ్యోతి, యామిని, రమాదేవి, అన్నమేరి, సంసోనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు

ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఆశ వర్కర్స్ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు కోరారు. కనీస వేతనం, ఇతర అనేక సమస్యలపై మంగళవారం గుంటూరు నగరంలోని మంగళదాస్ నగర్, ఇజ్రాయిల్‌పేట, ఎల్‌బి నగర్, శుద్ధపల్లిడొంక, లాంచస్టర్ రోడ్, లాలాపేట అర్బన్ హెల్త్ సెంటర్లలోని మెడికల్ ఆఫీసర్లకు వినతిపత్రాలు అందజేశారు. లాలాపేట అర్బన్ హెల్త్‌సెంటర్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో శ్రీనివాసరావు, ఆశా వర్కర్స్ యూనియన్ నగర నాయకులు కె.ప్రమీల మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు అమలు చేయట్లేదన్నారు. నిరసన అనంతరం మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దుర్గా, లక్ష్మి, సుధా, కేజియా భారతి, అనిత, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మేడికొండూరు : మండల సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రం వద్ద ధర్నా జరిగింది. ధర్నా అనంతరం సిఐటియు నాయకులు బొట్ల రామకృష్ణ, యూనియన్ అధ్యక్షురాలు సుజాత పిహెచ్‌సి వైద్యాధికారికి వినతి పత్రం ఇచ్చారు.



తుళ్లూరులో



తాడేపల్లిలో



ఫిరంగిపురంలో



కొల్లిపరలో

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్, తుళ్లూరు

నిడమర్రు యుపిఎస్సిలో ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు ప్రసంగించారు. తుళ్లూరు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డి శ్రీనివాస్ కు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు ఆశాలు సునీత, మల్లిక, రజిని వినతి పత్రం ఇచ్చారు.



దుగ్గిరాలలో

ప్రజాశక్తి - ఫిరంగిపురం

తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆశా వర్కర్లు ఆషా డే సందర్భంగా ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు.అనంతరం మెడికల్ ఆఫీసర్‌కి అర్జీ అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి మస్తాన్ వలి మద్దతు తెలిపి ప్రసంగించారు.

ప్రజాశక్తి- తాడేపల్లి

ఆశ కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు అన్ని రకాల జాతీయ పండుగలకు సెలవులు ఇవ్వాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి (సిఐటియు) కొప్పనాతి లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లి పట్టణంలోని, ప్రకాష్ నగర్ డ్రైవర్ కాలనీ పీహెచ్సీ వద్ద ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో తమ డిమాండ్ల సాధన కోసం ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వేముల దుర్గారావు, వేముల రేణుక, సిహెచ్ సుగుణ, విజయశ్రీ, విజయలక్ష్మి,జయలక్ష్మి, కెన్యా జ్యోతి, కరుణ కుమారి, బేబీ పాల్గొన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆస్పత్రి ప్రధాన వైద్యులకి అందజేశారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల : ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆశాడే సందర్భంగా దుగ్గిరాల, ఈమని పీహెచ్సీల వద్ద వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల ఉపాధ్యక్షుడు జట్టి బాలరాజు ప్రసంగించారు. అనంతరం సమస్యలతో కూడిన అర్జీని సిహెచ్‌ఓ అనితకు అందజేశారు. కార్యక్రమంలో దుగ్గిరాల ఆశాలు టి సునీత సుకుమారి విమల సుజాత మాలతి పార్వతి ఈమని ఆశాలు జయ మాధవి రేఖ తిరుమల దేవి ధనలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర : మండల ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కొల్లిపర మండలం మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ధర్నా నిర్వహించి డాక్టర్ నేహాకు సమస్యలపై వినతిపత్రం అందించారు. సిఐ టియు నాయకులు ములకా శివసాంబిరెడ్డి ఆశావర్కర్స్ యూని యన్ మండల కార్యదర్శి ఎం.జయప్రద ప్రసన్నకుమారి శివలీల తిరు పతమ్మ లంక పద్మ విజయలక్ష్మి ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



నీటమునిగిన పసుపు పంట

భారీ వర్షం... పంటలు మళ్లీ మునక

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఇటీవల అకాల వర్షాలతో పంటలు నీట మునిగి తీవ్రంగా నష్టపోతుంటే, తిరిగి సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షాలకు తాడేపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో పల్లపు పొలాలు వర్షపు నీరు బయటకు పోయే దారి లేక మళ్లీ మునిగాయి. సుమారు గంటన్నర పాటు భారీ వర్షం కురవడంతో పలు పంటలలో వర్షపు నీరు చేరింది. ఆకుకూరల మడులు సైతం నీటిలో నానాయి. ఇప్పటికే గత నెలలో అనేకసార్లు అధిక వర్షాలు కురవడం వలన చేతి కంది వచ్చిన పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పటికైనా పంట పొలాలలో ఉన్న డ్రైనేజీ కాలువ సర్వే చేయించి, పూడిక తీయించి, పంట పొలాలలో వర్షపు నీటిని బయటకు మళ్ళించేందుకు అధికారులు చర్యలు సత్వరమే చేపట్టకపోతే రైతాంగం పూర్తిగా నష్టపోయే పరిస్థితులు దాపురిస్తున్నాయి.

పంటలు నీటి మునగకుండా చర్యలు చేపట్టండి : సిపిఎం డిమాండ్

ఇటీవల అధిక వర్షాలు కురిసి రైతులు వేసిన పంటలన్నీ నీట మునుగుతున్న క్రమంలో డ్రైనేజీ బోర్డు అధిక వర్షాలకు పంటలు నీట మునగకుండా డ్రైనేజీ కాలువ పూడిక తీయించి, పంట పొలాలలో వర్షపు నీరు బయటకు పోయే విధంగా సత్వరమే చర్యలు చేపట్టాలని సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ అధికారులను కోరారు. ౖరైతులే స్వయంగా గండ్లు కొట్టుకొని వర్షపు నీటిని బయటికిపెట్టే ప్రయత్నం చేశారే తప్ప, అధికారులు చర్యలు చేపట్టలేదని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రైతుల నష్టపోకుండా చర్యలు చేపట్టాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు.

తిరోగమన భావాలను తిప్పి కొట్టండి

ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసకుమారి

ప్రజాశక్తి- తాడేపల్లి

సమాజంలో వేళ్లూనుకొని ఉన్న తిరోగమన భావాలను మహిళలు తిప్పి కొట్టాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షులు దొంతి రెడ్డి శ్రీనివాస్ కుమారి పిలుపునిచ్చారు. మంగళవారం తాడేపల్లి సుందరయ్య నగర్‌లోని లీలా సుందరయ్య కళావేదిక(బూరుగ సరస్వతి ప్రాంగణం) పై ఐద్వా తాడేపల్లి పట్టణ 6 వమహాసభ కార్యదర్శి ఎస్ గిరిజ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఐద్వా పతాకాన్ని బాల బొమ్మల లక్ష్మి ఆవిష్కరించారు. మహిళా ఉద్యమ మణిపూస మానికొండ సూర్యవతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసకుమారి మాట్లాడుతూ మతోన్మాదం, ప్రయివేటికరణ విధానాలతో మహిళలకు భద్రత కరువయిందని ఆందోళన వ్యక్తం చేశారు. నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న హింస, ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల కుటుంబాలు ఎలా ఛిద్రమౌతున్నాయో వివరించారు. పాలకులు అవలంబిస్తున్న విధానాల వలన మహిళలు అతి తక్కువ వేతనాలకే పని చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం, మత్తు పదార్థాల విక్రయాలను అరికట్టాలని



జెండా ఆవిష్కరణ చేస్తున్న బి లక్ష్మీ

ప్రభుత్వాన్ని కోరారు. వీటివల్ల దేశానికి ఉపయోగపడాల్సిన యువశక్తి నిర్వీరమైపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ సమస్యనయినా మహిళలు ఐక్యంగా పరిష్కరించుకోగలమని సోదాహరణంగా వివరించారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి పై జరిగిన దాడిని మహాసభ తీవ్రంగా ఖండించింది. స్థానిక సమస్యలు పరిష్కరించాలని, ఇళ్లపట్టాలు కార్యక్రమం వేగవంతం చేయాలని,ఇల్లు లేని వారికి ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని, రేషన్ షాపును ఏర్పాటు చేయాలని, మహిళలపై దాడులు, అకృత్యాలు అరికట్టాలని, డ్వాక్రాలో జరుగుతున్న అవినీతిని నిర్మూలించాలని కీర్తన, జ్యోతి, భ్రమరాంబ, ఉష పెట్టిన తీర్మానాలను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం తాడేపల్లి పట్టణ అధ్యక్ష కార్యదర్శులుగా డి విజయలక్ష్మి, ఎస్ గిరిజలతో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యింది.



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని

13,14 తేదీల్లో మండల కేంద్రాల్లో నిరసనలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి ఈనెల 13, 14 తేదీలలో జరిగే మండల కేంద్రాలలో జరిగే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. మండలంలోని కాజా గ్రంథాలయం సెంటర్‌లో కౌలు రైతు సంఘం గ్రామ మహాసభ కౌలు రైతు సంఘం నాయకులు అప్పికట్ల ప్రకాష్ రావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో రామారావు మాట్లాడుతూ భూ యజమానులు సంతకంతో పని లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు ఇవ్వాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు కూడా వర్తింపజేయాలని కోరారు. కౌలు రైతులకు ఈ క్రాఫ్ నమోదు చేసి ఎరువులు పురుగుమందులు ప్రభుత్వ ఇచ్చే నష్ట పరిహారాలను కౌలు రైతులకు కూడా ఇవ్వాలని, రైతు సేవా కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉంచాలని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విధానాల వలన పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదని , కావలసినంత మరోవైపు రైతులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రభుత్వాలు రైతన్న ఆదుకోవాలని కోరారు. అనంతరం 11 మందితో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా దొడ్డక వాసు, తాడిబోయిన నాగేశ్వరరావు ఉపాధ్యక్షులుగా చెన్నం వెంకటరామారావు సహాయ కార్యదర్శి అప్పికట్ల ప్రకాష్ రావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో భీమిరెడ్డి సత్యమారెడ్డి, గోపాలరెడ్డి , పేరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు



నిరసనలో పాల్గొన్న కార్మికులు, వివిధ సంఘాల నాయకులు

పని గంటల పెంపు దుర్మార్గం

ప్రజాశక్తి-గుంటూరు

పనిగంటల పెంపును ఉపసంహరించుకోవాలని, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. 8 పనిగంటల పని విధానాన్ని 13 గంటలకు పెంచుతూ అసెంబ్లీ ఆమోదించటాన్ని నిరశిస్తూ మంగళవారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిఐటియు గుంటూరు తూర్పు కమిటీ కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన నిరసనలో కార్మిక చట్టాలను రద్దు చేసి, కేంద్రం తెచ్చిన లేబర్ కోడ్‌ల అమలులో భాగంగానే ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం పనిగంటలు పెంచిందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలకు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్మిక రైతు వ్యతిరేక విధానాల అనుసరిస్తుందని, మహిళలను రాత్రిపూట పనిచేయించుకునేందుకు వీలుగా చట్టంలో అమోదం తెలపటం సరికాదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ ఇప్పటికే వర్క్‌ఫ్రం హోం పేరుతో కార్మికుల శ్రమను దోచుకుంటున్న కంపెనీలు ఇప్పుడు చట్టబద్ధంగా శ్రమదోపిడీ చేస్తాయన్నారు. కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను దేశంలో ఎక్కడా అమలు చేయకపోయినా మన రాష్ట్రంలో మాత్రం ప్రభుత్వాలు అమలుకు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు బి. రామకృష్ణ, సిఐటియు గుంటూరు పశ్చిమ కార్యదర్శి బి. ముత్యాలరావు, మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు సలీం, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ చిష్టీ, సిఐటియు జిల్లా కోశాధికారి ఎం.సాంబశివరావు, జిల్లా నాయకులు కె.నళినీ కాంత్ వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న కమిషనర్ వేణుబాబు, కెసిపి జిఎం

ఎస్ఎల్ఎఫ్‌కు 'స్వచ్ఛాంధ్ర' అవార్డు

ప్రజాశక్తి - మాచర్ల

స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాల సాధనలో భాగంగా మాచర్ల పట్టణంలోని నెహ్రూనగర్ స్లమ్ (ఎస్ఎల్ఎఫ్) ప్రతిష్ఠాత్మక స్వచ్ఛాంధ్ర జిల్లాస్థాయి అవార్డును సాధించింది. హోమ్ కంపోస్టింగ్ నిర్వహణ, టెర్రస్ గార్డెన్‌లో మొక్కల పెంపకం వంటి పర్యావరణహిత కార్యక్రమాల్లో చూపిన కషికి ఈ అవార్డు లభించింది. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో, జిల్లా కలెక్టర్ కత్తిక శుక్లా, ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబుల చేతుల మీదుగా నెహ్రూ నగర్ ఎస్ఎల్ఎఫ్ ప్రతినిధులు అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కత్తిక శుక్లా మాట్లాడుతూ, "పారిశుద్ధ్యం, హోమ్ కంపోస్టింగ్, టెర్రస్ గార్డెన్ నిర్వహణలో మాచర్ల నెహ్రూనగర్ ఎస్ఎల్ఎఫ్ ఆదర్శంగా నిలిచింది" అని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ వేణుబాబు కెసిపి జీఎం వెంకటరమణ, మెప్మా సీడీఎం, సీఓ అంజలి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. నెహ్రూనగర్ ఎస్ఎల్ఎఫ్ సభ్యుల కృషిని అధికారులు అభినందించారు.



మృతి చెందిన టెక్నికల్ అసిస్టెంట్ షేక్ బాషా

గుండెపోటుతో టెక్నికల్ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఉపాధి హామీ పథకంలో సాంకేతిక సహాయకులుగా పనిచేస్తున్న షేక్ బాషా గుండెపోటుతో మృతి చెందాడు. గుంటూరు నుండి రోజు పెదకూరపాడుకు బైకు లేదా బస్సులో వస్తూ డ్యూటీకి హాజరవుతుంటాడు. మంగళవారం స్థానిక బస్టాండ్ సెంటర్లో కుప్పకూలిపోయాడు. అతనిని స్థానికులు పెదకూరపాడులోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. అతనిని ఎండిఓ సాయిలీల, మండల కార్యాలయ పర్యవేక్షణ అధికారి సోమయాజులు, ఏపీవో కోటమ్మ, సిబ్బంది నివాళులర్పించారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - వెల్దుర్తి

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఈనెల 6 నుండి 10 వరకు నిర్వహిస్తున్న మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా సోమవారం, మంగళవారం శిరిగిరిపాడు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు మానసిక ఆరోగ్య కౌన్సిలర్ ఖాదర్ షాహ్ హుస్సేన్ తన విలువైన సూచనలు అందించారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి విడదీయలేని సంబంధం ఉందని, ఆరోగ్యకరమైన (సమతుల్య) ఆహారం మనస్సును సమతులం చేస్తుందని అన్నారు. రోజు ధ్యానం, యోగ చేయడం వల్ల మనసుకు ప్రశాంతత చేకూరుతుందని సూచించారు. ధ్యానం మరియు యోగ కేవలం మానసిక ప్రశాంతతను కలిగిస్తాయనీ, విద్యార్థు ల్లో ఏకాగ్రత పెరిగి చదువులో రాణించడానికి దోహద పడతాయని ప్రిన్సిపాల్ పి.పద్మ చెప్పుకొచ్చారు. మంగళవారం పాఠశాలలో జరిగిన ధ్యానం, యోగా కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రైతు సాగు చేసిన మినుము పంట



పురుగు ఆశించిన పంట

తెగుళ్లతో మినుము రైతు కుదేలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రధాన పంటకు ముందు పంట మార్పిడి చేయాలన్న వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు ఖరీఫ్‌లో విస్తారంగా సాగు చేసిన మినుముకు తెగుళ్ల, ముడత, పురుగు సోకి నష్టపోయే పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ సీజన్లో ప్రధాన పంటకు ముందు మినుము వేసి లాభాలు గడిద్దామనుకున్న అన్నదాతలకు నిరాశే మిగిలింది. వాతావరణ పరిస్థితుల మార్పుల కారణంగా పంటకు తెగుళ్ల సోకడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆశించినంతగా దిగుబడులు రావడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. ఖరీఫ్‌లో ప్రధాన పంట వేయడానికి ముందుగా ఆరుతడి పంటగా మినుము, పెసర వంటి అపరాల పంటలు కొందరు రైతులు సాగు చేపట్టారు. ప్రధాన పంటలతో పోలిస్తే పెట్టుబడి తక్కువ కావడంతో రైతులు మినుము వైపు మొగ్గు చూపారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో మినుము సాగు చేస్తున్నారు. వ్యవసాయ ఖర్చులు, విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగు మందుల కొరకు పెట్టుబడి కింద ఎకరాకు రూ.12 వేలు వరకు ఖర్చు చేశారు. పంట చేతికి వచ్చే సమయంలో తెగుళ్ల పంటను దెబ్బతీశాయి. ఎండు తెగుళ్ల, వైరస్ వ్యాప్తితో ఎర్రగా మారి పూత రాలిపోయి దిగుబడి సరిగా రాని దుస్థితి నెలకొంది. తెగుళ్ల నుంచి పంటలను కాపాడు కోవడానికి రైతులు మందులకు అధిక ఖర్చు పెడుతుండగా, ఇప్పుడు అధిక వర్షాలు కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. రెండు రోజుల నుంచి వరుసగా వానలు కురుస్తుండటంతో పంటల్లో నీరు నిల్వ ఉండి వేరుకుళ్లు తెగుళ్ల వ్యాపిస్తుందని వాపోతున్నారు.

రామాయణాన్ని రచించిన ఆదికవి వాల్మీకి

నివాళులర్పించిన కలెక్టర్ కృతిక శుక్లా, ఎస్పి కృష్ణారావు



నివాళి అర్పిస్తున్న కలెక్టర్ కృతిక శుక్లా, తదితరులు



జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పి కృష్ణారావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సమాజాన్ని ప్రభావితం చేసేలా కుటుంబ, మానవీయ విలువలు ప్రతిబింబించేలా రామాయణాన్ని రచించిన ఆదికవి వాల్మీకి అని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, ఎస్పి బి.కృష్ణారావు అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని కలెక్టరేట్ లో కలెక్టర్, జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పి కృష్ణారావు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణం మానవాళికి అనుసరణీయమన్నారు. త్రేతాయుగంలో రచించిన రామాయణం గొప్ప కావ్యమనీ, అంతటి మహాకవి అందరివాడని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నత విలువలతో ముందుకు సాగాలన్నారు. ఎస్పి మాట్లాడుతూ ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే మధుర కావ్యం రామాయణం రచించి యుగాలు గడిచినా ఆదర్శంగా నిలిచే విధంగా సమాజానికి అందించిన మహోన్నత వ్యక్తి వాల్మీకి అన్నారు. ఆయా కార్యక్రమాలలో జిల్లా రెవిన్యూ అధికారి మురళి, అదనపు ఎస్.పి జెవి సంతోష్, ఏఆర్ అదనపు ఎస్.పి వి.సత్తిరాజు, ఏఆర్ డిఎస్పి మహాత్మా గాంధీ రెడ్డి,ఆర్ఐ, రాష్ట్ర వాల్మీకి బోయ సంఘం డైరెక్టర్ ముప్పన వెంకటేశ్వర్లు, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంఘం డైరెక్టర్ గంగాధర్, బిసి సంక్షేమ సాధికారిత అధికారి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నరసరావుపేట

రామాయణాన్ని అందించిన ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా పల్నాడు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పులమాలలతో నివాళు లర్పించారు. ఎస్పీ బి.కృష్ణారావు మాట్లాడుతూ కుటుంబ, మానవతా విలువలు ప్రతిబింబించే విధంగా మహా కావ్యం రామాయణాన్ని రచించి, సమాజానికి అందిం చిన వాల్మీకి మహాకవి కృషి ఎనలేనిదన్నారు. ఆయన ప్రబోధించిన ఆశయాలను, పవిత్రమైన ఆలోచనలను ప్రతి ఒక్కరూ జ్ఞప్తికి తెచ్చుకుంటూ సన్మార్గంలో నడవడమే వాల్మీకి మహర్షికి మనం ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. అదనపు ఎస్పీ జె.వి.సంతోష్, ఏఆర్ అదనపు ఎస్పీ వి.సత్తిరాజు ఏఆర్‌డిఎస్పీ మహాత్మాగాంధిరెడ్డి ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

400కేవి సబ్‌స్టేషన్‌ను జెసి తనిఖీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం వెన్నాదేవి సమీపంలో ఉన్న 400 కె.వి సబ్ స్టేషన్‌ను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనూరే మంగళవారం తనిఖీ చేశారు. 400 కె.వి సబ్ స్టేషన్ అలియనేషన్ నిమిత్తం తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో సత్తెనపల్లి ఆర్డీవో రమణ కాంత్ రెడ్డి, సత్తెనపల్లి తహశీల్దార్ కెఎస్ చక్రవర్తి, 400కెవి ట్రాన్స్కో ఏడిఏ నాగేశ్వరరావు, ఇరిగేషన్ డిఈ శ్రీనివాసరావు ,హ్యాండ్లూమ్స్ సొసైటీ డెవలప్మెంట్ ఆఫీసర్ రాజవర్ధన్ రెవిన్యూ సర్వేయర్లు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

సంపూర్ణ ఆరోగ్యానికి శుభ్రత ముఖ్యం

ప్రజాశక్తి గి తెనాలి

స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాల, సాలిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మంగళవారం ఆశాడే నిర్వహించారు. కార్యక్రమ పరిశీలనాధికారిగా జిల్లా మలేరియా అధికారి టి. మురళీకృష్ణ సుబ్బరాయణం పాల్గొన్నారు. ఆశా వర్కర్లు, వైద్య సిబ్బందితో వివిధ అంశాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత పాటించకపోతే వచ్చే అనర్ధాలను వివరించారు. ఏదైనా ఆహారం తీసుకోవడానికి ముందు, మలవిసర్జన తరు వాత చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. అనంతరం కొత్తపేటలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర హాస్టల్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం లో బృందం పాల్గొన్నారు. డాక్టర్ వేముల ప్రియాంక, హాస్టల్ ప్రిన్సిపల్ ఇ నిరీక్షణరావు, సహాయ మలేరియా అధికారి సిహెచ్ ప్రభాకరరెడ్డి, డాక్టర్ దివి కిషోర్ కుమార్, డాక్టర్ డి.సుభాష్ రమాదేవి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



వాల్మీకి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వాల్మీకి మహర్షి ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు సత్తెనపల్లి పట్టణంలోని 12వ వార్డులో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సందర్భంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయ కులు ఎదులదొడ్డి శ్రీనివాసరావు, కంబాల వెంకటేశ్వరావు, యెలివేడి రామస్వామి, మస్తాన్వలి తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలలో తనిఖీలు

ప్రజాశక్తి-ఈపూరు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఈపూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ పరిధిలో ఉన్న మద్యం దుకాణాలలో మద్యం సీసాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు ఎక్సైజ్ సీఐ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. రొంపిచర్ల మండలం రొంపిచర్లలోని త్రికోటేశ్వర వైన్స్, ఈపూరులోని జనతా వైన్స్ మద్యం దుకాణాలలోని మద్యం సీసాలను ఏపీ బీసీఎల్ డిపో టిపీలతో తనిఖీ చేసి ఏపీ టాట్స్‌యాప్ ద్వారా పరిశీలించినట్లు తెలిపారు. ప్రభుత్వ లైసెన్స్ కలిగిన మద్యం దుకాణాలలో కల్తీ, నకిలీ మద్యం అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బహి రంగ ప్రదేశాలలో మద్యపానం చేసే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాలలో కల్తీ, నకిలీ మద్యం, కల్తీ కల్లు, నాటుసారా, మాదకద్రవ్యాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని సిఐ కోరారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న కొమెర్ల దుర్గారావు

రూ.10వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక 25వ వార్డులో తెలుగుదేశం సీనియర్ మహిళ కార్యకర్త మంజుల అచ్చమ్మ అకస్మాత్తుగా మరణించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందించగా, ఆ నగదును ఏపీ రాష్ట్ర వడ్డెర సంఘ కార్పొరేషన్ డైరెక్టర్, పట్టణ టిడిపి అధ్యక్షులు కొమెర దుర్గారావు అచ్చమ్మ కుటుంబ సభ్యులకు అందించారు. ఆయన వెంటదొడ్డా చందు, జ్యోతి, అంజి, మంజుల వెంకటేశ్వర్లు, మాచర్ల బాబు ఉన్నారు.

కెఎల్‌యును జర్మనీ ప్రతినిధుల బృందం సందర్శన

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీని జర్మనీకి చెందిన చెన్నైలోని జర్మన్ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్, హైదరాబాద్‌లోని జర్మనీ కాన్సుల్ అమిత దేశాయ్ మంగళవారం సందర్శించారు. కెఎల్ విశ్వవిద్యాలయంలోని వివిధ రకాల ఆచార్యులను, పరిశోధకులను కలిసి విద్యా, పరిశోధన సహకారాల అవకాశాలను గురించి విస్తత స్థాయిలో చర్చలు జరిపారు. అనంతరం వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారధి వర్మ, ప్రో వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, అంతర్జాతీయ సంబంధాల డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు, అంతర్జాతీయ సంబంధాల డైరెక్టర్ విజయ్ మారుతి, విదేశీ భాషల విభాగాధిపతి జమీందార్‌లను కలిశారు.

వ్యక్తిగత జాగ్రత్తలు పాటించండి

ప్రజాశక్తి - దుగ్గిరాల

సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో మంగళవారం ఎలుకల నివారణకు బ్రోమోడియో లిన్ అనే మందును రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని ఈమని గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో పాల్గొన్న మండల వ్యవసాయాధికారి ఆర్ విజయబాబు మాట్లాడుతూ ఎలుకల మందు కలిపేటప్పుడు తప్పనిసరిగా గ్లౌస్ ధరించి వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండలానికి 88 కేసుల ఎలుకల మందు వచ్చిందని ఎనిమిది వేల హెక్టార్లకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో పంచాయతీ సిబ్బంది వ్యవసాయ సిబ్బందితో కలిసి బృందాలు ఏర్పాటు చేసి మందును పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ ఐ సునీత జిల్లా పంధరుల శాఖ టెక్నికల్ ఏవో రాజ వంశీ పాల్గొన్నారు.

విజయవాడలో పరీక్ష కేంద్రానికి అనుమతి

ప్రజాశక్తి - దుగ్గిరాల

విద్యార్థులకు, లాయర్లకు ఈనెల 30వ తేదీన లా నిర్వహించనున్న పర్మినెంట్ సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ పరీక్షకు విజయవాడ కేంద్రానికి అనుమతి ఇవ్వడంతో లావిద్యార్థులు, లాయర్లు సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు. విజయ వాడ కేంద్రం తిరిగి ఏర్పాటు చేయాలని ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు ప్రభుత్వం స్పందించింది. గతంలో హైదరాబాద్ విశాఖపట్నం సెంటర్లను ఎన్నుకున్న వారికి తిరిగి విజయవాడ సెంటర్లో పరీక్ష రాసేందుకు అనుమతి కూడా వచ్చింది. దీనితో దాదాపు వెయ్యి మందికి మేలు జరుగుతుందని లాయర్లు తెలిపారు. గతంలో హైదరాబాదు విజయవాడ విశాఖపట్నంలలో పరీక్ష కేంద్రాలు ఉండగా ఈ సంవ త్సరం విజయవాడ కేంద్రాన్ని రద్దు చేసింది. తిరిగి విజయవాడ కేంద్రాన్ని అనుమతించినట్లు తెలిపింది.

ఎల్‌వోసీ చెక్కు అందజేత

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి బాపణయ్యనగర్‌కు చెందిన వడ్డె శ్రీనివాసరావు కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ. లక్షా 20 వేల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) మంజూరు చేశారు. ఈ మేరకు మంగళవారం టీడీపీ నాయకులు బాధితుని ఇంటికి వెళ్లి ఎల్‌వోసీ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో 28వ వార్డు అధ్యక్షులు తురకా వీరశేఖర్ బాబు, ప్రధాన కార్యదర్శి తోట కరుణ కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగులను పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఏపీప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందరికీ అన్ని ఇస్తున్నార ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రం ఏమీ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఉద్యోగులకు రావలసిన 12వ వేతన సవరణ కమిటీని నియమించలేదని పేర్కొన్నారు. పిఆర్సి గడువు ముగిసి 26 నెలలు గడిచినా ఇప్పటి వరకు ఐఆర్ ప్రకటించలేదని, సిపిఎస్ అంశాన్ని ఇంతవరకు ప్రస్తావించలేదని తెలిపారు, ఈనెల 10వ తేదీన జరిగే రాష్ట్ర క్యాబినెట్లో చర్చించి నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వాల్మీకి జయంతి వేడుకలు

ప్రజాశక్తి - పెదకాకాని


నివాళి అర్పిస్తున్న నాగిరెడ్డి

మండల కేంద్రమైన పెదకాకానిలోని గ్రంథాలయంలో మంగళవారం వాల్మీకి జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి నంద్యాల నాగిరెడ్డి మాట్లా డుతూ బోయవానిగా జన్మించి తనను తాను పరివర్తించుకున్న తీరు అందరికీ ఆదర్శనీయమని పుట్టుక ప్రధా నం కాదు మనిషి ప్రవర్తనలో మార్పు చెందితే మహర్షి కావచ్చని తెలియజేశారన్నారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన రాసిన ఇతిహాసాలను కొనియాడారు. యల్.సాల్మన్ రాజు, యస్.సంగీత రావు, యల్. కిషోర్, మంత్రయ్య, బి.ప్రభాకర్, ప్రవీణ్, బి.బాబు పాల్గొన్నారు.


పెంచిన పనిగంటలకు వ్యతిరేకంగా మున్సిపల్ కార్మికుల నిరసన


ఎర్రబాలెంలో మాట్లాడుతున్న రవి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ / తాడేపల్లి

పని గంటల పెంపును వ్యతిరేకిస్తూ సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం ఎర్రబాలెంలో పని విరామ సమయంలో, రాజధాని ముఖద్వారం ఉండవల్లిలో జరిగిన కార్మికుల నిరసన కార్యక్రమంలో సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గత నెల 19వ తేదీన అసెంబ్లీలో పని గంటలు పెంచుతూ చేసిన తీర్మానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీల చట్టం 1948కి ప్రభుత్వం చేసిన సవరణలు కార్మికులను బానిస లుగా మారుస్తాయని, తక్షణం ఈ సవరణలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ మెప్పు కోసం, కార్పొరేట్లకు లాభం చేకూర్చే విధంగా, కార్మికులను బానిసలుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పనిగంటల పెంపుబిల్లును ఆమోదించిందని అన్నారు. సెక్షన్ 65లోని సబ్‌సెక్షన్ 2, 3లో పని గంటలు పెంచుకోవచ్చని అసెంబ్లీ తీర్మానం చేయటం చూస్తుంటే మోడీ తెచ్చిన లేబర్ కోడ్‌లను రాష్ట్రంలో శరవేగంగా అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్ని స్తుందని అన్నారు. సెక్షన్ 66లోని సబ్ సెక్షన్ 1(బి)లో రాత్రి 7 నుండి ఉదయం 6 గంటల వరకు రాత్రి షిఫ్టుల్లో మహిళ కార్మికులు పని చేయాలని తీర్మానం చేయటం దుర్మార్గమని అన్నారు. పట్టపగలే మహిళలకు పని ప్రదేశాల్లో రక్షణ లేక ఇబ్బం దులకు గురవుతున్న నేపథ్యంలో రాత్రిపూట కూడా మహిళ లు పని చేయాలని అసెంబ్లీలో చట్టం చేయడం శోచనీయ మని అన్నారు. పని గంటల పెంపును ప్రభుత్వం విరమిం చు కోకపోతే కార్మికులను సంఘటితం చేసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని రవి హెచ్చరించారు. రైతు సంఘం రాజధాని డివిజన్ నాయకులు అత్తలూరి వీరవెంకయ్య మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు.

కమిషనర్ అలిమ్‌బాషా, డాక్టర్ అనూషకు సత్కారం


కమిషనర్‌ను, డాక్టర్ అనూషను సన్మానిస్తున్న చంద్రశేఖర్

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రభుత్వం వివిధ కేటగిరీలలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ స్వచ్ఛ ఎంటీఎంసీగా స్వచ్ఛ ఆంధ్ర అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అందుకున్న కమిషనర్ అలిమ్‌బాషా, ఉత్తమస్వచ్ఛ హాస్పిటల్‌గా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా చేతుల మీదుగా అవార్డు అందుకున్న డాక్టర్ పి.అనూషను టీడీపీ నాయకులు మంగళవారం సన్మానించారు. కమిషనర్ అలిమ్‌బాషాను పెదవడ్లపూడి మాజీ సర్పంచ్, టీడీపీ శాశ్వత సభ్యులు అన్నే చంద్రశేఖర్, నాయకులు శాలువాతో సత్కరించి పూలమొక్కను అందజేశారు. అనంతరం హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి. అనూషను అన్నే చంద్రశేఖర్, నాయకులు ఆమెను శాలువాతో సత్కరించి పూలమొక్కను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్నే నందకిషోర్, బోయపాటి రమేష్, రంగిశెట్టి పెద్దబ్బాయి, హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పలు ఉపయోగాలు : బ్రెజిల్ బృందం


పంటలు పరిశీలిస్తున్న బ్రెజిల్ ప్రతినిధుల బృందం

ప్రజాశక్తి - కొల్లిపర

ప్రకృతి వ్యవసాయం అమలు విధానాలపై అవగాహన పొందడానికి రాష్ట్రంలో పర్యటిస్తున్న బ్రెజిల్ ప్రతినిధుల బృందం మంగళవారం కొల్లిపర మండలంలోని అత్తోట దావు లూరిపాలెం గ్రామాలలో పర్యటించారు ఏపిసిఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి బృందానికి స్వాగతం పలికి గుంటూరు జిల్లాలో రైతు సాధికార సంస్థ అధ్వర్యంలో కొనసాగుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు, అమలు తీరు, ప్రకృతి వ్యవసాయ రైతుల సంఖ్య పురోగతి వివరాలు క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా రైతు సాధికార సంస్థ లీఫ్ టెక్నాలజి, ఇన్నో వేషన్ ఆఫీసర్ శ్రీ లక్ష్మ నాయక్ బయో ఇన్పుట్‌ల తయారీపై డెమో పద్ధతిలో బృంద సభ్యులకు అవగాహన కల్పించారు ఘన జీవామృతం తయారీని బృందం ఎంతో ఆసక్తిగా గమనించింది అనంతరం శ్రీ లక్ష్మ నాయక్ మాట్లాడుతూ ఏడాది పాటు పంటలతో భూమిని కప్పి వుంచడం తో ఏ గ్రేడ్, ఏ+ గ్రేడ్, ఏ++గ్రేడ్, ఎటిఎం, పిఎండిఎస్ వంటి మోడల్స్ అనుస రించడం వల్ల కలిగే అనేక రకాల ప్రయోజనాలను వివరణాత్మకంగా వివరించారు. దేశీ ఆవుప్రకృతి వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆవు పేడ, మూత్రంలో అధికంగా లభించే సూక్ష్మ జీవులు భూసారాన్ని పెంచి పంటల ఆరోగ్యాన్ని కాపాడ తాయని చెప్పారు. బీజామృతం, ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, విత్తన గుళికల తయారీ ప్రక్రియలో బ్రెజిల్ బృంద సభ్యులు చురుకుగా పాల్గొని వాటి వినియోగం, ప్రయోజనాలను తెలుసుకున్నారు. అనంతరం దావులూరి పాలెం గ్రామం లోని న్యూట్రిగార్డెన్ ఆరోగ్యం, పోషకాహార కార్యకలాపాల లబ్ధిదారులను కలిసి నిర్వహణ ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. బృంద సభ్యులు ప్రకృతి వ్యవసాయం లో మహిళల పాత్రపై అవగాహన పొందే దుకు అభ్యుదయ గ్రామైక్య సంఘ సభ్యులతో పరస్పరం చర్చలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్రెజిల్ బృంద సభ్యులతో పాటు రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు జాకీర్ హుస్సేన్, కృష్ణారావు, వాణిశ్రీ పాల్గొన్నారు.

రేపటి నుండి దంత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పెదకాకాని


సమావేశంలో మాట్లాడుతున్న డీన్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్

మండల పరిధిలోని తక్కెళ్ళపాడు గ్రామంలోని సిబార్ దంత వైద్య కళాశాల రజతోత్సవాలు పురస్కరించుకొని ఈనెల 9వ తేదీ నుండి 15వ తేదీ వరకు కాస్మెటిక్ సేవలు మినహా ఉచిత దంత వైద్య పరీక్షలు, దంత వైద్య చికిత్సలు నిర్వహించనున్నట్లు కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్ తెలిపారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రజతోత్సవాలలో భాగంగా ప్రజలకు విద్యార్థులకు దంత వ్యాధుల నిర్ధారణ, నియంత్రణ, చికిత్స పద్ధతులపై అవగాహన కల్పించడం కోసం దంత వైద్య వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని, ఈ ప్రదర్శనలో అన్ని దంత విభాగాలకు సంబంధించిన సమస్య లు, అధునాతన చికిత్సలు ప్రజలకు తెలియజేసి నోటి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తామన్నారు. పొగాకు వాడటం వల్ల వచ్చే దుష్పరిణామాలను, నోటి ఆరోగ్యం కోసం తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియ చెప్పడం జరుగుతుంది అన్నారు. సమావేశంలో డైరెక్టర్ డాక్టర్ కృష్ణమోహన్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గార్డెన్స్, లక్ష్మీపురంలో డ్రైన్ల పూడికతీత చేపట్టాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో హనుమయ్య విగ్రహం నుండి బృందావన్ గార్డెన్స్, లక్ష్మీపురం మదర్ థెరిస్సా విగ్రహం వరకు బుధవారం నుండి ఇరువైపులా డ్రైన్లపై ర్యాంప్‌లు, ఆక్రమణలను తొలగించి, పూడికతీత పనులు చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులతో సంయుక్త సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రోడ్లపై పడిన వర్షం నీరు నేరుగా డ్రైన్‌లోకే వెళ్లాలని, అందుకు తొలుత డ్రైన్లను ఓపెన్ చేసి, నూరు శాతం పూడిక తీయాలన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో డ్రైన్లు ఓవర్‌ఫ్లో జరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగాలు సమన్వయంతో డ్రైన్ల శుభ్రం చేయటం, ఆక్రమణల తొలగింపు చేపట్టాలని ఆదేశించారు.అలాగే జిన్నాటవర్ నుండి చేపట్టిన డ్రైన్లపై శ్లాబులు, ఆక్రమణల తొలగింపు, పూడికతీత పనులను మరోవైపు కూడా వేగంగా చేస్తూ వై జంక్షన్ వరకు చేపట్టాలని డిసిపిని ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులు ఏఈల వారీగా బిల్లులను నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రజారోగ్య అధికారులు డివిజన్ల వారీగా మైక్రో ప్యాకెట్స్ రీ ఫైనల్ చేయడం, వాటికి కేటాయించిన కార్మికులు, ఇళ్ల సంఖ్యలతో కూడిన వివరాలు అందించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ (ఇంచార్జి) సుందర్రామిరెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీ నారాయణ, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు పాల్గొన్నారు.


దీక్షల్లో ఏసిసి సిమెంట్ కార్మికులు

308వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

చట్టపరంగా తమకు రావలసిన బకాయిల కోసం ఏసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు మంగళవారం నాటికి 308వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సిఐటియు పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ కార్యదర్శి కే.స్టీవెన్, సిహెచ్ పిచ్చయ్య, షైక్‌సుభాని, వై.సాంబశివరావు, డి.నాగేశ్వరావు ప్రారంభించారు. దీక్షల్లో శారమ్మా, రమాదేవి, రిబ్కా, సువర్ణకుమారి, కాసమ్మ కూర్చున్నారు. సిఐటియు నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని న్యాయమైన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తుపాకుల నాగేశ్వరావు, దుర్గాభవాని, శివ కుమారి, గురవయ్య, ఆశీర్వాదం, అంకయ్య, మాణిక్యరావు, హగ్గయ్యా, సూర్యప్రకాష పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్ పోటీలకు సాయి నవనీత్ ఎంపిక

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్


నవనీత్‌తో ఉపాధ్యాయులు

కాకినాడలో ఈనెల 25, 26 తేదీలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి రోలర్‌స్కేటింగ్ పోటీలకు ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్ విద్యార్థి జి.సాయి నవనీత్ ఎంపికైనట్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప మంగళవారం తెలిపారు. జోజప్ప మాట్లా డుతూ అక్టోబర్ 5, 6 తేదీలలో గుంటూరులో నిర్వహించిన 20వరోలర్ స్కేటింగ్ పోటీలలో సీనియర్ విభాగానికి తమ పాఠశాల విద్యార్థి సాయినవనీత్ పాల్గొని బంగారు, వెండి పతకాలు సాధించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయికీ సాయి నవనీత్ ఎంపిక కావడం పట్ల తమ స్కూలు కు ఎంతో గర్వ కారణం అన్నారు. మంగళవారం విద్యార్థి సాయినవనీత్‌ను పాఠ శాల వ్యాయామ ఉపాధ్యాయులు మల్లం పూడి రవి, నూతక్కిరవి, ఉపాధ్యాయులు గ్రామపెద్దలు అభినందించారు.

నేటి నుండి పోస్టల్ శాఖ ఆధార్ క్యాంప్‌లు

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ తపాలా వారోత్సవాలలో భాగంగా తపాలా శాఖ గుంటూరు డివిజన్ ప్రజలకు ఆధార్ నమోదు, అప్‌డేట్ సేవలను అందించటానికి అక్టోబర్ 8 నుండి 14వ తేదీ వరకూ ఆధార్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కాంపులు వివిధ తపాలా కార్యాలయాల్లో, నిర్దేశించిన పాఠశాలలు, నివాస కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలతో సహా ఎంపిక చేసిన ప్రజాప్రదేశాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే మొబైల్ ఆధార్ క్యాంప్‌లు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. 8, 9 తేదీల్లో స్థంబాలగరువులోని విజ్ఞాన్ హైస్కూల్, 10, 11 తేదీల్లో పెదవడ్లపూడిలోని నాగార్జునా హైస్కూల్, 13, 14 తేదీల్లో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరికీ ఆధార్ నమోదు, అప్‌డేట్‌సేవలు ఉచితంగా అందిస్తామన్నారు. కావున ప్రజలు ఈ క్యాంప్‌లను వినియోగించుకోవాలని కోరారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సెక్రెటరీ

ఆర్‌విఆర్ జెసి విద్యార్థులకు జాతీయ బహుమతి

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రికల్ బైక్‌కు జాతీయ స్థాయిలో అవార్డుతోపాటు, నగదు బహుమతులు కూడా సాధించినట్లు కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని తెలిపారు. తమిళనాడు, కోయంబత్తూరులోని శ్రీరామకృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మెక్ట్రాన్ మోటార్స్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన నేషనల్ లెవల్ ఈబైక్ ఛాలెంజ్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానం పొంది, రూ.10వేలు నగదు బహుమతి సాధించారన్నారు. అదనంగా బెస్ట్ హోల్ క్లింబ్ అవార్డు, బెస్ట్ బంప్ టెస్ట్ ఆవార్డు, బెస్ట్ రన్నర్ డ్రా రేస్ అవార్డు, బెస్ట్ రన్నర్ ఆటోక్రాస్ వంటి నాలుగు ప్రత్యేక అవార్డులు కూడా గెలుచుకున్నారని తెలియజేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను మంగళవారం కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాల కృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, పిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

గణిత శాస్త్రం ద్వారా మేధో వికాసం

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న డాక్టర్ సాయికిరణ్

విద్యార్థి దశలో గణిత శాస్త్రం పట్ల ఆసక్తి కనపరిచే విద్యార్థులు భవిష్యత్‌లో మిగతా అన్ని సబ్జెక్టులలో చురుకుగా ఉంటూ మేధాశక్తిని కనబరుస్తారని గణిత శాస్త్ర బోధకులు డాక్టర్ బి సాయికిరణ్ అన్నారు. స్థానిక నగరంపాలెం, ప్రజ్ఞ పాఠశాలలో 'వేదిక్ మ్యాథ్స్, మెమరీ టెక్నాలజీ, మైండ్ పవర్, మిడ్ బ్రెయిన్ యాక్టివేషన్' అంశాలపై సాయికిరణ్ ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయికిరణ్ మాట్లాడుతూ వేదాలు ప్రపంచ భాషలకు పునాది అయితే, వేద గణితం అన్ని శాస్త్రాలకు తల్లి వంటిదన్నారు. ఏ సబ్జెక్టులోనైనా ప్రామాణికాలు అంకెలు లేకుండా ఉండవన్నారు. వేదిక్ మ్యాథమెటిక్స్ నేర్చుకోవటం చాలా సులువు అని, వాటిపై పట్టు సాధించడం ద్వారా మిగతా అన్ని విషయాలలో మేధావులుగా రాణిస్తారని వివరించారు. పాఠశాల కార్యదర్శి, కరస్పాండెంట్ నాయుడు చక్ర నాగ్ మాట్లాడుతూ మెరుగైన విద్యా బోధనతో పాటు విద్యార్థుల సమగ్ర వికాసానికి కావలసిన అన్ని రకాల శిక్షణలు అందిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు సుధారాణి, షేక్ సలీం, రవి, షేక్ సుభాని పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అక్రమాలను సహించం

ఎమ్మెల్యే గల్లా మాధవి హెచ్చరిక

ప్రజాశక్తిళ-గుంటూరు జిల్లా ప్రతినిధి



ంషన్ పంపిణీలో అక్రమాలను సహించబోమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరిం చారు. రేషన్ పంపిణీ వ్యవస్థ పై మాధవి మంగళవారం తన కార్యాలయంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్ సరఫరా, లబ్ధిదారుల వివరాలు, డీలర్ల పనితీరు, నియమ నిబంధనల అమలు వంటి అంశాలపై విస్తతంగా చర్చ జరిగింది. మాధవి మాట్లాడుతూ లబ్ధిదారులందరికీ సమయానికి సరుకులు అందించాలన్నారు. ఏ ఒక్కరికి అన్యాయం జరగకూడదన్నారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి వారి హక్కుగా ప్రభుత్వ సరుకులు తప్పక అందాలన్నారు. ఇది అధికారుల బాధ్యత, డీలర్ల కర్తవ్యం" అని స్పష్టం చేశారు. ఎవరైనా రేషన్ పంపిణీ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కొందరు రేషన్ షాపులను వ్యాపార సంస్థల్లా నడుపుతున్నారు. ఇలాంటి ప్రవర్తన అస్సలు సహించం. డీలర్లు సిండికేట్‌లా వ్యవహరించడం కుదరదన్నారు. అలాగే మునిసిపల్, విద్యుత్ అధికారులతో మాట్లాడుతూ రోడ్డుకు అడ్డముగా ఉన్న విద్యుత్తు స్తంభాలను పక్కకు తొలగించాలన్నారు. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్తు స్తంభాల చిత్రాలను అధికారులకి చూపించి వెంటనే వాటిని పక్కకు జరిపి ఏర్పాటు చేయాలన్నారు. 36వ డివిజన్ లో ఉన్న చాకలికుంట ఆక్రమణలకు గురయ్యిందన్నారు. వెంటనే సర్వే జరిపి ఈ కుంటను పరిరక్షించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి టౌన్ ప్లానింగ్ అధికారి నారాయణ స్వామి నీ ఆదేశించారు. అదే విధంగా కొండయ్య కాలనీలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలన్నారు.

తెలంగాణ, కర్ణాటక తరహా కులగణన చేపట్టాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు

తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో కులగణన చేపట్టాలిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. జనగణనలో కులగణన తక్షణమే చేపట్టాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థలలో సీట్లు కేటాయించాలని కోరుతూ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణలో జనగణనలో కులగణన చేయడమే కాకుండా త్వరలో జరుగబోతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన 42 శాతం సీట్లు బీసీలకు కేటాయించడం జరిగిందన్నారు. అదేవిధంగా కర్ణాటకలో సిద్ధరామయ్య కులగణన చేపట్టారని, రానున్న రోజుల్లో ఆయా కులాలు, వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడానికి పూనుకుంటున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా కులగణన చేపట్టాలని, ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో 143 బిసి కులాలు ఉంటే కేవలం 10 కులాలు మాత్రమే అభివృద్ధి చెందాయన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అతి త్వరలో పంచాయతీ ఎన్నికలు రాబోతున్నాయని ఎన్నికల కమిషన్ ప్రకటించిందని, అయితే మూడు నెలల ముందే ఎన్నికలు నిర్వహించాలని వారు భావిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో తమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి రాష్ట్రంలో జనగణనతో పాటు కులగణన చేయాలని, జనాభా దామాషా ప్రకారం ఏబీసీడీ వర్గీకరణ చేయాలని తద్వారా తక్కువ జనాభా ఉన్న కులాలకు కూడా న్యాయం జరుగుతుందని వివరిస్తామన్నారు. కులగణన కోసం క్షేత్రస్థాయి నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. అవసరమైతే చలో అమరావతికి సిద్ధం కావాలని అన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ కులగణన జరిగితే బీసీలు ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని చెప్పారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు మాట్లాడుతూ అట్టడుగున ఉన్న వర్గాలకు న్యాయం జరగాలంటే కులగణన జరగాలని, దాని కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. టీడీపీ జిల్లా నాయకులు శివరామయ్య మాట్లాడుతూ సమాజంలోని మెజారిటీ ప్రజల హక్కులు, వారి ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివద్ధి కోసం తాము కృషి చేస్తామన్నారు. జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమాజానికి ఏది మంచిదైతే దానిని అమలు చేసుకుందామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొరివి వినయ్ కుమార్ మాట్లాడుతూ జనగణనలో కులగణన అనేది జాతీయ ఉద్యమం అని, ఇది బీసీల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని స్పష్టం చేశారు.సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు, డాక్టర్ ఆలా వెంకటేశ్వరరావు, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి, ముస్లిం లీగ్ అధ్యక్షులు బషీర్ అహ్మద్ వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ

చీఫ్ జస్టిస్‌పై దాడిని తీవ్రంగా పరిగణించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై మతోన్మాదుల దాడి అన్యాయమని వామపక్ష పార్టీల నాయకులు, కాంగ్రెస్ పార్టీ, దళిత సంఘాలు, మైనార్టీ, క్రైస్తవ, న్యాయవాదులు, నాయకులు మాట్లాడుతూ అన్నారు. మంగళవారం సాయంత్రం మంగళగిరి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ మతోన్మాదుల ఆగడాలు పెరిగిపోతున్నాయని, సుప్రీం కోర్టులో ఒక కేసు విచారణ సందర్భంగా మతత్వం నిలువెల్లా నింపుకున్న ఒక లాయర్ చీఫ్ జస్టిస్‌పై దాడికి ప్రయత్నించటాన్ని తీవ్రంగా పరిగణించాలన్నారు. న్యాయవాది కిషోర్ పై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు మైనార్టీలు, దళితులను టార్గెట్ చేసిన వారు నేరుగా ఇప్పుడు సుప్రీం కోర్టునే ప్రశ్నిస్తున్నారని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని అన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా, సనాతన ధర్మ వాదులను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్, సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య, సిపిఎం నాయకులు టి శ్రీనివాసరావు, సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, నాయకులు ఏ ప్రభాకర్, నందం బ్రహ్మేశ్వర రావు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యదర్శి కె రామారావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కే జీవన్ సాగర్, కే రాధిక, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మంగళగిరిలో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల, వివిధ రాజకీయ పార్టీల నాయకులు

ప్రజాశక్తి తెనాలి, తెనాలి రూరల్

చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా గవాయ్ పై జరిగిన దాడిని బార్ అసోసియేషన్ బృందం తీవ్రంగా ఖండించింది. న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విధులు బహిష్కరించి, నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమ ంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బేతాళ ప్రభాకర్, ఉపాధ్యక్షులు అన్నం పిన్నారావు, సెక్రటరీ గౌరిశంకర్, సభ్యులు మెంబెర్ కొమ్ము అబ్రహం లింకన్, సీనియర్ న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, మద్ది మల్లికార్జున రావు, ఏ.ఏ.యఫ్ జిల్లా అధ్యక్షులు దాసరి శ్రీధర్, రవి రాజ్, వేములపల్లి. శ్రీనివాస్, అబ్దుల్ ఆరీఫ్ పాల్గొన్నారు. జస్టిస్ బి.ఆర్ గవాయ్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బహుజన సమాజ్ పార్టీ తెనాలి నియోజకవర్గం ఇంచార్జి కారు మంచి సునీల్ సందీప్ స్థానిక ఐతానగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు.

ప్రజాశక్తి-గుంటూరు

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై సనాతన ధర్మోన్మాదం తలకెక్కించుకున్న న్యాయవాది బూటు విసిరి దాడికి ప్రయత్నించటం అత్యంత ఆందోళన కరమని అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటువంటి బెదిరింపులు తనను ప్రభావితం చేయబోవని చీఫ్ జస్టిస్ గవాయ్ చూపిన నిబ్బరం న్యాయవ్యవస్థపై గౌరవాన్ని ఇనుమడింప చేస్తుందన్నారు. ఈ చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు.

పన్ను వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-గుంటూరు



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్, కమిషనర్

నగరాభివృద్ధిలో ఆస్తిపన్ను వసూళ్ల కీలకమని, ప్రతి వార్డు సచివాలయం పరిధిలో బకాయిలు, ప్రస్తుత పన్ను నూరు శాతం వసూళ్లు చేసేలా అడ్మిన్ కార్యదర్శులు, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, అధికారులు కృషి చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. మంగళవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, ఇన్స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో నగరంలో విస్తృతంగా అభివద్ధి పనులు జరుగుతున్నాయని, రానున్న కాలంలో నగర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా అభివద్ధి పనులు చేపట్టను న్నామన్నారు. అభివృద్ధి పనులకు పన్ను వసూళ్లు ముఖ్యమని, ప్రతి ఒక్కరు పన్ను వసూళ్ళపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం, రెండవ అర్థ సంవత్సరం వచ్చినప్పటికీ పన్ను వసూళ్ళలో పురోగతి లేదని అసహనం వ్యక్తం చేశారు. వాటర్, మీటర్ల చార్జీల వసూల్లల్లో కూడా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసి శనివారం నాటికి పురోగతి లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్.ఐలు, అడ్మిన్ కార్యదర్శులు క్షేత్ర స్తాయిలో పన్ను వసూళ్ళ పై శ్రద్ధ పెట్టకుంటే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కష్ణయ్య, రెవెన్యూ అధికారులు రవి కిరణ్ రెడ్డి, మదన్ గోపాల్, సాదిక్ బాష, రెహ్మాన్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.